# ఆతిథ్యము

శ్రీమతి మన్య. కామేశ్వరీదేవిగారు

అది సుప్రభాతము. దినకరుని కిరణజాలములచే ప్రపంచమంతయు నుత్తేజితముగానుండెను. పెద్ద కొండలసమీపమున మధుకుల్యానది తిన్ననినడకలతోఁ బ్రవహించుచుండెను. అరుణకాంతులు నీటిపై ప్రసరించుటవలన నదీగర్భమంతయు కాంతివంతముగానుండెను.

ప్రవంతీ తీరమునకు, కొంచముదూరమున, (గాయకష్టముచేసి) జీవించు కొందఱి కుటీరములుండెను. శ్యామసింగు తనకుటీరద్వారము చెంతఁగూర్చుండి దీర్ఘాలోచనము చేయుచుండెను. అప్పుడు దేశమునఁగఱవు, క్షామ దేవత వెలకొలఁది ప్రజలను తన పొట్టఁబెట్టుకొనెను. ఆహారపదార్థములు చిక్కక శ్యామసింగు కుటుంబము కొన్నిదినము లుపవాస ముండవలసిన దీనస్థితియందుండెను. శ్యామసింగు కుటీరమున యతని భార్య, ముగ్గురుబిడ్డలు; తినతిండిలేక వారందఱు జీవచ్ఛవము లైయుండిరి.

శ్యామసింగు పరుల కష్టములను జూచి యోర్వలేనివాఁడు. తోడిజనులకు సహాయముఁ జేయుటయన్న ముందంజవేయువాఁడు. కుటీరవాసియోచన, నది ఆవలిగట్టువద్దకు వేగముతోఁబరుగెత్తుకొని వచ్చుచున్న యొక అశ్వము గిట్టల చప్పుడువలన భంగమై, అతడావైపునకు దృష్టిసారించెను.

మధుకుల్యానది చాలాలోతు, వెడల్పుగలది. ప్రవాహము మిక్కిలి వేగముగానుండెను. అశ్వము నధిరోహించిన వీరుఁ డుక్కుకవచమును ధరియించియుండెను. అశ్వారూఢుఁడు మిక్కిలి వేగముతో వచ్చి నదియందుదిగెను. గుఱ్ఱముపైనొక సంచికూడాయుండెను. ప్రవాహము తీవ్రముగా నున్నందునను, నదిలోతైనందున, అశ్వమునకు బరువుయెక్కువైనందున, అదిముందునకు నడువలేక మునిగిపోవజొచ్చెను. ఈస్థితిని పరిశీలించి, ఆశ్వికుఁడు గుఱ్ఱమునుండిదిగి, ఆవలిగట్టుచేరుటకై యీదుటకు మొదలిడెను. ప్రవాహము ఒత్తిడివలన యోధుఁ డీదలేక తికమకపడుచు, ఆవలిగట్టు చేరలేకుండెను. అతని శిరస్సు మాత్రము పైకిఁ గనబడుచుండెను. శీఘ్రముగనే అతడు ప్రవాహమునందు కొట్టుకొనిపోవఁజొచ్చెను. ఇతని దురవస్థయంతయు జూచుచున్న శ్యామసింగు బలహీన స్థితియందున్నను ప్రవాహమునందు దుమికి యెంతో కష్టముతో నాయోధుని గట్టునకుఁజేర్చెను యోధునకు స్పృహలేకుండెను. కుటీరవాసి, యతనికి తగు పపర్యలొనర్చుటవలన కొంతసేపటికి స్పృహగల్గెను. మెల్లగా నేత్రములనుతెఱచి, చెంతనున్న శ్యామ సింగును చూచి, అతనికి కృతజ్ఞతా సూచకముగా నమస్కరించెను.

శ్యామసింగునుచూచి ఆశ్వికుడు "సోదరా! నీవు నాప్రాణములను కాపాడితివి. కొంతకాలమువఱకు, నేను నీ రక్షణయందుండుటకు యంగీకరించెదవా?" యని యడిగెను. శ్యామసింగు దీనముగా, "యోధుడా! నేను, నాకుటుంబము తినతిండిలేక ఉపవాసముల చేయుచున్నాము ఇటువంటి స్థితిలో నా ఆశ్రయము నీకేమి ఉపయోగ"మనినుడివెను. ఈపలుకులువిని యోధుడు,"నీవుఅధైర్యపడవలదు. నాఅశ్వముగట్టుచేరినది. దానివీపుపై ఆహారపదార్థములుగల యొకసంచిగలదు. అదితీసుకొని నీకుటీరమునకు వెళ్లుదమురమ్ము"నిబల్కెను. అమృతమయమైన ఈ చల్లనివాక్కులనువిని, కుటీరవాసి సంపూర్ణహృదయానందముతో యతనికి సంతోష పూర్వకమైన నమస్కారమునుజేసి, తనకుటీరమునకుఁ దోడ్కొనిపోయెను. చిన్న కుటీరమును ప్రవేశించుట తోడనే, శ్యామసింగుభార్య, ముగ్గురుబిడ్డలు మరణావస్థలో నేలమీద పడియుండుటఁగనబడెను. హృదయము నీరైపోవు ఈదృశ్యమును చూడగానే, ఆశ్వికునకు మిక్కిలిజాలిగల్గెను.

ఆశ్వికుఁడు ఆహారపదార్థముల సంచిని, విప్పిచూడగా అన్నియు దడిసియుండెను. అయితే, ఆ సంచియందు పండ్లరసములుగల కొన్నిసీసాలుండెను. ఆ రసములను త్రాగుటవలన (పాపము!) వారికి కొంత జీవశక్తిగలిగెను. ఎండిపోవుమొలకలకు నీరుపోసి జీవము కొల్పినట్లయ్యెను. వీరిట్లుండగా, నది ఆవలిగట్టున కొంద ఱాశ్వికులు వచ్చుచుండుటఁ గనబడెను. వారు నదిదాటి ఈవలకువచ్చి, శ్యామసింగు కుటీరమున రక్షణపొందుచున్న యోధుని పట్టుకొనవలెనని వచ్చిన ఆశ్వికులు. మధుకుల్యా నదియందు ప్రవాహము వేగముగానున్నందున వారీవలి గట్టుచేరలేక వెడలి పోయిరి.

కుటీరమునకువచ్చి న మరునాడే ఆశ్వికునకు తీవ్రమైన జ్వరమువచ్చెను. కొన్నిదినములకు ఈజ్వరము మిక్కుటమై సందిగ్ధావస్థ గలిగించెను. ఈసమయమున శ్యామసింగు, యతని భార్యయు, యోధుని ఒక్క నిమిషముకూడ నేమరక సపర్యలు చేయుచుండిరి. ఆశ్వికుఁడుతెచ్చిన ఆహారపదార్థములు ముగియుట తోడనే శ్యామసింగు అతనిసంచియందు మరియొకమూటనుగల బంగారునాణెములను వెచ్చమునకు వాడుకొన మొదలిడెను. యోధుఁడు ఆ కుటీరమునకు వచ్చుటవల్ల, శ్యామసింగు కుటుంబము కొంతవఱ కాకలి బాధనుండి కాపాడబఁడెను. కుటీరవాసి వెచ్చమునకు దగినంత డబ్బునుమాత్రము వెచ్చించుచుండెనే గాని, వ్యర్థముగా నొక్క పైసనుకూడ వాడుకొనలేదు. వీరి సపర్యవలన కొంతకాలమునకు ఆశ్వికునకు స్వస్థత చేకూరఁదొడగెను. అప్పుడు కుటీరవాసి యోధునిముందర డబ్బుసంచినుంచి, తనుకర్చుపెట్టినది గాక తక్కిన దాతనికిచ్చెను. ఇంతకాలము యోధుఁడు శ్యామసింగునింట నుండుటవలన, భార్యాభర్తల యకలంకమైన ప్రవర్తనను తెలుసుకొని సంతసించెను.

త్వరలో యోధుఁడు శ్యామసింగు నాతిథ్యమునుండి మరల పోవలసినదినమువచ్చెను. సంపూర్ణ హృదయానందముతో, చిరునవ్వుమోముతో, యోధుఁడు శ్యామసింగునుచూచి "సోదరా! నేను జబ్బులో నుండగా మీరిద్దరు నాకెంతో సపర్యచేసి ప్రాణములను కాపాడితిరి. నే నీజన్మములో ఈ ఋణమును తీర్పలేను. త్వరలోనే మిమ్ములనువదలిపెట్టి పోవలసినదినము సమీపించినది." అని నుడివెను. శ్యామసింగు చాలాకరుణతో "ఆశ్వికుడా! మేము ఉపవాసములతోనుండగా నీవు మాజీవములను కాపాడితివి. ఈ నీ సహాయము మఱువరానిది. మనకు వియోగముకలుగుచున్నందులకు చింతిల్లుచున్నా"నని చెప్పెను. యోధుఁడు గంభీరవదనముతో శ్యామసింగుతో "ప్రాణసఖా! నీకు నాకానుకగా ఈరత్నాల ఉంగరమును, కొన్ని బంగారు నాణెము లనిచ్చుచున్నాను, స్వీకరింపుమని" నుడివి, తన వ్రేలనున్న రత్నాల యుంగరమును శ్యామసింగు వ్రేలికి పెట్టి, నాణెములనిచ్చెను. శ్యామసింగు ఉంగరము వైపునకు చూడగానే మహానంద మునుఁబొందెను. ఆ ఉంగరమున రత్నములతో "హుమయూన్ చక్రవర్తి" యని పొదుగబడియుండెను, సంభ్రమముతో భార్యాభర్తలా సార్వభౌమునకు సాష్టాంగనమస్కారమొనర్చి, "ప్రభూ! మేము భారత మహాచక్రవర్తి ప్రాణములను కాపాడినందుకు పరమానందమును బొందుచున్నాము. మీరు మా కుటీరమును పావనము జేసితిరి"అని పలికిరి. చక్రవర్తియు ఆ పుణ్యదంపతులను ఆశీర్వదించెను. వెనుక, శ్యామసింగు, చక్రవర్తి ప్రయాణమునకుగావలసిన సదుపాయములను జేయదొడగెను. 2 గంటలతర్వాత "హుమాయూన్ చక్రవర్తి" తన యశ్వము నధిరోహించి చిరునవ్వుమోముతో శ్యామసింగు కుటీరమునువదలిపోయెను.